సాక్షి ఒడిశా

గురువారం । 29 । ఆగస్టు । 2024



ఆటో దొంగతనం చేసిన వ్యక్తి అరెస్టు

వేర్వేరు చోట్ల ఆటో, చెవి దుద్దులు దొంగతనం చేసిన వ్యక్తిని నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర పోలీసులు అరెస్ట్ చేశారు.

-8లో



పోలవరం రహస్య పర్యటన

ఆంధ్రప్రదేశ్–ఒడిశా రాష్ట్రాల మధ్య వివాదంగా మారిన పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతాన్ని ఒడిశాలోని విపక్ష బిజూ జనతా దళ్ పార్టీ ముఖ్య నాయకులు రహస్యంగా పరిశీలించారు.

-8లో



పేపర్ మిల్లు కార్మికుల ఆందోళన

రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని విధాన సభ ప్రాంతంలో జయపురం సేవా పేపర్ మిల్లు కార్మికులు బుధవారం ఆందోళన తెలిపారు.

-8లో

న్యూస్‌రీల్

ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ కౌర్

రాయగడ: ప్రధానమంత్రి జన్‌ధన్ ప్రచార రథాన్ని గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్ మంగళవారం ప్రారంభించారు. ఆదివాసీ, హరిజన తెగలకు చెందిన ప్రజల ఆర్థిక పురోగతికి ఎంతగానో తోడ్పడే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుణుపూర్ సమితి పరిధి 7 పంచాయతీల్లో 136 లంజియా సవర తెగలు నివసిస్తున్న గ్రామాల్లో ఈ ప్రచార రథం తిరుగుతుంది. కార్యక్రమంలో బీడీవో శుభ్రాంజలి ప్రధాన్, లంజియా సవర అభివృద్ధి సంస్థ స్పెషల్ అధికారి ఆసీమ రావ్ పాల్గొన్నారు.

పాముకాటుతో బాలుడు మృతి



కోరుకొండ ఆరోగ్య కేంద్రం వద్ద బాలుడి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలో బలిమెల పట్టణంలోని ఎన్‌ఎస్‌సీ కార్యాలయం వీధిలో నివాసముంటున్న గీత అనే మహిళా తన భర్త, ఇద్దరి పిల్లలతో ఇంటి వద్ద మంగళవారం రాత్రి పడుకుంది. అయితే ఆ సమయంలో ఒక విషసర్పం తన కొడుకు ధర్మేంద్ర(6) చెవిపై కాటువేసింది. దీంతో బాలుడు ఏడుపు విని గీత తన భర్తను లేపి చూస్తే పాముకాటు వేసినట్లు గుర్తించారు. వెంటనే అర్ధరాత్రి 2 గంటలకు బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ బాలుడిని పరిశీలించిన వైద్యులు మల్కన్‌గిరికి రిఫర్ చేశారు. దీంతో అంబులెన్స్‌లో తీసుకొని వెళ్తుండగా తర్లకోట వద్ద బాలుడి పరిస్థితి విషమిస్తోందని కోరుకొండ ఆరోగ్య కేంద్రంలో చూపిస్తుండగా అక్కడ బాలుడు మృతి చెందాడు. ఐఐసీ సుమన్ పట్నాయిక్ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం బాలుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.


పోస్టుమాస్టర్ హత్య కేసులో ఐదుగురు అరెస్టు



అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి నీలిగూడ పంచాయతీలోని మట్టేరు గ్రామానికి చెందిన పోస్టుమాస్టర్ నాందో మడ్కమి ఈనెల 25వ తేదీన హత్యకు గురైన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టారు. ఐఐసీ రామేశ్వర్ ప్రధాన్ విచారణలో అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారిలో కోశ మడ్కమి, కేసు మడ్కమి, దేశ మడ్కమి, దేబె మడ్కమి, కోశే మడ్కమిలు ఉన్నారు. బుధవారం వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. నాందో గ్రామంలోనే మంచి ఉద్యోగంతో స్థిరపడి చురుకుగా ఉంటున్నాడనే కోపంతో అతడిని మట్టుబెట్టినట్లు తెలుస్తోంది.

254 మందికి అటవీ భూపట్టాలు



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురాం

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలో 254 మంది లబ్ధిదారులకు అటవీ భూముల పట్టాలు బుధవారం అందజేశారు. బొయిపరిగుడ సమితి రామగిరిలో జయపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో రామగిరి, దండాబడి, చిపాకూర్, హల్దికుండి గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారులకు పట్టాలను కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ భూములపై ఆధారపడి జీవిస్తున్న నిరుపేదలందరికీ పట్టాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆదివాసీ హరిజన ప్రజల హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ, జయపురం అటవీ డివిజన్ డీఎఫ్‌వో ప్రతాప్ కుమార్ బెహర, బొయిపరిగుడ తహసీల్దార్ స్నిగ్ధరాణి చౌదరి, బొయిపరిగుడ అటవీ విభాగ అధికారి రామచంద్ర నేపక్, సమితి సంక్షేమాధికారి రామేశ్వర నాయక్, సమితి అధ్యక్షుడు ప్రభాత్ కుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

అందాల లక్క బొమ్మ.. చూపు తిప్పనీయదమ్మా...!



లక్కబొమ్మలు తయారు చేస్తున్న సుంకారీ మహిళలు

- ఆకట్టుకుంటున్న నబరంగ్‌పూర్ లక్క బొమ్మలు
- సాంప్రదాయ కళకు జీవం పోస్తున్న మహిళలు
- దేశ, విదేశాల్లోనూ పేరు ప్రఖ్యాతలు
- ప్రత్యేక ఆకర్షణగా పూర్ణకుంభం

హస్త కళకు సృజనాత్మకత, వినూత్నమైన ఆలోచనలు తోడైతే లక్క బొమ్మలు రూపుదిద్దుకుంటాయి. కళా నైపుణ్యం ప్రదర్శించగా ఉత్పత్తయ్యే అపురూపమైన చిహ్నాలివి. సాంప్రదాయ కళలకు జీవం పోస్తున్న సుంకారీ మహిళల మానస పుత్రికలు ఈ అందమైన బొమ్మలు. రాజుల కాలంలో ఎంతో ఆదరణకు నోచుకొని, నేడు కాలక్రమేణా నిరాదరణకు లోనవుతున్న అద్భుతమైన కళాఖండాలు. సాధారణ ప్రజల నుంచి ప్రధానమంత్రి, విదేశీయుల వరకు ప్రశంసలు అందుకున్న ఈ బొమ్మలను దండ కారణ్యంలోని చెట్లలో దొరికే లక్కతో చేస్తారు. వీటి తయారీని ఒకసారి పరిశీలిస్తే...

కొరాపుట్: బాపు బొమ్మలకే పోటీ ఇచ్చే బొమ్మలు లక్క బొమ్మలు అని ఒక నానుడి ఉంది. అలాంటి లక్క బొమ్మలు అంటే ఒడిశాలో గుర్తుకొచ్చేది నబరంగ్‌పూర్ జిల్లా. వందల సంవత్సరాలుగా ఈ బొమ్మలు దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతలు గాంచాయి. సుంకారి జాతి మహిళలు మాత్రమే తమ హస్తకళ నైపుణ్యంతో ఈ బొమ్మలు చేయగలరు. వారు తరతరాలుగా ఈ సాంప్రదాయ కళకు జీవంపోస్తూ వస్తున్నారు. ఈ బొమ్మలు చూస్తే కళ్లు చెదిరే అందాలతో కట్టిపడేస్తాయి. ఈ ప్రాంతానికి ప్రముఖ వ్యక్తులు వచ్చేటప్పుడు వారికి బహుమతిగా ఈ లక్క బొమ్మలు ఇవ్వడం ఆనవాయితీ. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం ఈ కళను మెచ్చుకున్నారు. ఇప్పటికీ విదేశీయులు ఈ బొమ్మలు తయారు చేసే విధానం చూడడానికి వస్తుంటారు.

తయారీ విధానం

దండ కారణ్యంలోని చెట్లలో దొరికే లక్కని సేకరించి, వాటిని కాల్చిన బొగ్గుల మీద వేడి తీగలుగా తయారు చేస్తారు. ఆ తీగలను మరలా వేడి చేస్తూ అందమైన కళాకృతులు తీర్చిదిద్దుతారు. ఇవి కేవలం మహిళలు తమ చేతివేళ్లని తిప్పుతూ తీగని అమరుస్తూ తయారు చేస్తారు. అవసరానికి తగ్గ విధంగా రంగులను లక్కలో కలుపుతారు. ప్రస్తుతం లక్కని నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి నుంచి తెప్పిస్తున్నారు. వెదురుతో ఒక ఆకృతి చేసి, దాని మీద లక్క అద్దుతారు. మరికొన్ని ఆకృతులను మట్టిపై లక్క వినియోగించి తయారు చేస్తారు. ప్రస్తుతం వెదురుని కొరాపుట్ నుంచి, మట్టిని పపడాహండి సమీపంలో కొండిగుడ నుంచి, రంగులను బ్రహ్మపుర నుంచి తెప్పిస్తున్నారు.

ఎవరీ సుంకారీ మహిళలు

పూర్వకాలంలో నబరంగ్‌పూర్ ప్రాంతంలో రాజులు సుంకారి వారిని తెప్పించి ఆశ్రయం కల్పించారు. వారు చేసే లక్కగాజులు రాజవంశీయ స్త్రీలకు ఎంతో నచ్చేవి. అందుకే రాజులు వీరిని ఆదరించారు. జిల్లా కేంద్రంలోని సుంకారి వీధిలో వీరు ఎక్కువగా నివసిస్తున్నారు. కాల క్రమేణా రాజ వంశాలు అంతరించాయి. కానీ ఈ కళని ఆ మహిళలు రక్షిస్తున్నారు. సమాజంలో వచ్చిన మార్పులు నేపథ్యంలో వారు కూడా కళ శైలిని మార్చారు. తమ కళతో పూర్ణ కుంభాలు, దేవుళ్ల బొమ్మలు, గిఫ్ట్ బాక్స్‌లు, గోడ చిత్రాలు, వివిధ రకాల బహుమతులు, ఇంటి ముందు పెట్టే నేమ్ బోర్డులు తయారు చేస్తున్నారు. వీరు తయారు చేసే గాజులు ధరిస్తే శుభంగా మహిళలు భావిస్తారు. అదేవిధంగా పూర్ణకుంభం నేడు ప్రత్యేక ఆకర్షణగా మారింది.

లక్కు లేదు

ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నా వీరి చేతివృత్తి కళకి ప్రభుత్వ సహకారం అంతగా లభించడం లేదు. వీరు తమ కళాకృతులతో ప్రభుత్వం ఏర్పాటు చేసే అనేక జాతీయ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. న్యూఢిల్లీ, సూరత్, ముంబాయి, హైదరాబాద్, సురజ్‌కుండ్ తదితర ప్రాంతాల్లో ప్రదర్శించారు. రెండుసార్లు అంతర్జాతీయ ప్రదర్శనలకు ఆహ్వానం వచ్చినా ఆర్థిక పరిస్థితి బాగోలేక వెళ్లలేకపోయారు. 2003లో నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్‌గా అరవింద పాఢీ వచ్చినప్పటి నుంచి వీరికి ప్రోత్సాహం వచ్చింది. తాను ఏ శాఖకి బదిలీ అయినా ఈ మహిళలకు సాయం చేసేవారు. గత ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ని ఒప్పించి వీరు ముడి సరుకులు నిల్వ చేయడానికి అవసరమయ్యే భవనం కోసం రూ.73 లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం అరవింద పాఢీ పూరీ దివ్యక్షేత్రం ప్రధాన పాలనాధికారిగా ఉన్నారు. కానీ అక్కడ నుంచి కూడా వీరి యోగక్షేమాలు వాకబు చేస్తుంటారు. ప్రస్తుతం సుమారు 100 మందికి పైగా మహిళలు ఈ కళని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు.



సిద్ధమవుతున్న లక్కబొమ్మ





లక్కతో తయారు చేసిన అందమైన పెట్టె



పూర్ణ కుంభం



ఆకట్టుకుంటున్న లక్కబొమ్మ



అందమైన లక్క బొమ్మలు



లక్కతో తయారైన వస్తువులు



ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లక్కబొమ్మ బహూకరిస్తున్న దృశ్యం



లక్కబొమ్మ కొంటున్న మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

ప్రాణాలు బలిగొంటున్న అతిసారం




పాదెయ్‌ఖదర గ్రామంలో పరిస్థితులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే రఘురాం మచ్చ

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలోని పలు గ్రామాల్లో అతిసారం ప్రజల ప్రాణాలను బలిగొంటోంది. సమితిలో ఇప్పటికే దాదాపు 12 మంది దీనివలన ప్రాణాలు కోల్పోగా, మఠపడ గ్రామ పంచాయతీ ముసాపడ గ్రామంలో సిలెన్ గొలారి అనే మహిళ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు తెలుస్తోంది. అలాగే ఆ గ్రామంలో చంపా ఖొర అనే మరో మహిళ వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు లోనవ్వడంతో ఆమెను జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అలాగే బొయిపరిగుడ సమితి చిపాకూర్ పంచాయతీ, కొలార్ పంచాయతీలో బాలుబెడ, బొదాపుట్ పంచాయతీలోని అండియగుడ గ్రామాల్లో పలువురు అస్వస్థతతో బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చ అతిసార బాధిత చికాపూర్ గ్రామ పంచాయతీ పాదెయ్‌ఖదర గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఇటీవల 5 మంది మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. వ్యాధిగ్రస్తులకు వైద్యమందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని వైద్యులను ఆదేశించారు. ఆయనతో పాటు చికాపూర్ పంచాయతీ సర్పంచ్ రాజు ఖిలో, బొయిపరిగుడ సమితి మాజీ అధ్యక్షుడు నరేంద్ర కందలియ, లోకనాథ్ ఖొర తదితరులు ఉన్నారు.



గొలారి మరణంతో విలపిస్తున్న బంధువులు

లాకెట్ దొంగ అరెస్టు



స్వాధీనం చేసుకున్న లాకెట్ బిళ్లలు



నిందితుడు గణేష్ బస్త

జయపూర్: స్థానిక రాయిబాబు వీధిలో ఈనెల 26వ తేదీన ఒక బాలిక మెడలో బంగారు లాకెట్టు దొంగలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు ఇన్‌చార్జి అధికారి ఈశ్వర తండి బుధవారం వెల్లడించారు. నిందితుడి నుంచి లాకెట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు స్థానిక గోపబంధునగర్‌కు చెందిన గణేష్ పూజారి ఉరఫ్ గణి బస్తగా పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 26వ తేదీ సాయంత్రం నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్ మెయిన్ రోడ్డులో నివాసముంటున్న ఎల్.భాస్కర పాత్రో కుమార్తె, అతడి మనుమరాలు కలిసి రాయిబాబు వీధిలో ఒక దుకాణానికి వెళ్లారు. ఈ సందర్భంగా బాలిక మెడలో లాకెట్‌ను వెనుక నుంచి ఒక వ్యక్తి వచ్చి తెంచుకుపోయాడు. ఈ విషయంపై జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ వీధిలో సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. అతడి వద్ద రెండు బంగారు లాకెట్లు స్వాధీన చేసుకున్నట్లు తెలిపారు.

రూ.20 లక్షల ప్రభుత్వ ఆర్థిక సాయం



డీఎండీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు



ప్రభుత్వ సాయం ధ్రువీకరణ పత్రం చూపిస్తున్న సదన్ కొలార్

కొరాపుట్: బాల్యం నుంచే డ్యూచెన్నె మస్క్యూలర్ డైస్ట్రోఫి(డీఎండీ) వ్యాధితో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు ప్రభుత్వం రూ.20 లక్షల ఆర్థిక సాయం అందజేసింది. నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి కుటాబాయి గ్రామ పంచాయతీ చలిపిట గ్రామానికి చెందిన సదన్ కొలార్‌కి నలుగురు కుమారులు. వారు బాల్యం నుంచే అనారోగ్యంతో బాధపడేవారు. వారిలో ఇద్దరు చిన్నారులు ఇదివరకే చనిపోయారు. దీంతో మిగతా ఇద్దరినీ రక్షించుకోవడానికి నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అయినప్పటికీ నయం కాకపోవడంతో వైద్యులు కటక్‌లోని శ్రీరామచంద్ర భంజ వైద్య కళాశాలకి తరలించారు. అక్కడ వైద్య నిపుణులు వీరిద్దరికీ డ్యూచెన్నె మస్క్యూలర్ డైస్ట్రోఫి (డీఎండీ) ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో వీరిని భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కి తరలించారు. వారు కూడా ఈ ఇద్దరి బాలలకు డీఎండీ ఉన్నట్లు ధ్రువీకరించారు. బాధిత బాలలు ఎక్కువ కాలం జీవించడం కష్టమని చెప్పారు. వారికి అధునాతనమైన చికిత్స, ఆహారం, వైద్యం అవసరమని స్పష్టం చేశారు. దీంతో సదన్ కొలార్ నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తన గోడు విన్నవించుకున్నాడు. వెంటనే అధికారులు ఈ విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. దీంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఒక్కొక్క బాలుడికి రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.20 లక్షల సాయం అందింది. జిల్లా చరిత్రలో ఇప్పటివరకు వైద్య నిమిత్తం ఇంత సాయం అందడం ఇదే మొదటిసారిగా అధికారులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



బొమ్మలు వేస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: పురపాలక సంఘాల స్వపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని టౌను హాలులో వివిధ పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ, సంగీతం, చిత్రలేఖనం పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా పురపాలక సంఘం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గౌరచంద్ర పట్నాయిక్ విచ్చేయగా, న్యాయ నిర్ణేతలుగా రఘునాథపాత్రో, బిచిత్రా నందబెబర్తా, మనోజ్ పట్నాయిక్, పోరిచ్చాలు వ్యవహరించారు. పోటీల విజేతలకు ఆగస్టు 31న స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేస్తామని కార్యనిర్వహణ అధికారి గౌరచంద్ర పట్నాయిక్ తెలియజేశారు.

ఏబీవీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వం నమోదు చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని రాయఘడ సమితి సేవక్‌పూర్ పరశురాం గురుకుల ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం చేపట్టారు. అనంతరం గురుకుల పాఠశాల నుంచి కలకత్తాలోని డాక్టర్ మౌమితా దేబనాథ్ అత్యాచారాన్ని నిరసిస్తూ ర్యాలీ జరిపారు. ర్యాలీలో ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ జెన్నా తదితరులు పాల్గొన్నారు.

యువజన సమ్మేళనం



యువ సమ్మేళనం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్రా సమితి కలియగుడ గ్రామంలో వనవాసీ కల్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో యువజన సమ్మేళనం బుధవారం నిర్వహించారు. వనవాసీ కల్యాణ ఆశ్రమం కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు బాలాజీ బెహర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అఖిల భారత వనవాసీ కల్యాణ ఆశ్రమం యువజన ప్రముఖుడు భైరవ సురంగజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి పరిరక్షణలో జనజాతి నిర్వహించాల్సిన భూమికపై మార్గదర్శకాలు ఉద్బోధించారు. ఒడిశా వనవాసీ కల్యాణ ఆశ్రమం లక్ష్యం, ఆదర్శం, సంస్థ కార్యక్రమాల ప్రచారాలపై రమాకాంత సాహు విపులంగా వివరించారు. వనవాసులు భారతీయ మూలాలని, వారి అభివృద్ధే దేశాభివృద్ధి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జయపురం పట్టణ వనవాసీ కల్యాణ ఆశ్రమానికి చెందిన లక్ష్మీకాంత మిశ్ర, సునామణి నాయిక్, సంగీత జాని, ప్రఫుల్ల బిశాయి, సదా భూమియ, అరుణ పాల్, లక్ష్మణ గదబ, అమర పాల్, చంతి బిమళ, బేణుధర పాత్ర తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు తులాభారం



పటిక బెల్లంతో తులాభారం సమర్పిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లిలో కొలువైన శ్రీ వెంకటేశ్వరస్వామివారికి పార్వతీపురం పట్టణానికి చెందిన బంటుపల్లి చిన్నమ్మలు పటిక బెల్లంతో బుధవారం తులాభారం ఇచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనల అనంతరం స్వామివారికి నిర్వహించిన తులాభారం కార్యక్రమంలో బి.గణేష్, ఆలయ అర్చకుడు అప్పలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన దీక్ష

పార్వతీపురం టౌన్: ఏకలవ్య పాఠశాలల్లో పనిచేస్తూ ఉద్యోగాలు కోల్పోయిన తమకు తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట గిరిజన యువతులు పువ్వల లావణ్య, పండిక బంగారమ్మలకు చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనేతర అభ్యర్థులైన జి.రమేష్, డి.తేజేశ్వరిలకు ఇచ్చినట్లే తమకు కూడా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్ కుమార్, మైదాన ప్రాంత గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు రఘుపతుల శశిభూషణ్, నందివాడ పార్వతీశం, ఉద్యోగం కోల్పోయిన గిరిజన యువతులు పువ్వల లావణ్య, పండిక బంగారమ్మ, గిరిజన నిరుద్యోగ యువకులు విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రహస్య పర్యటన

- పర్యాటకుల మాదిరిగా బీజేడీ నాయకుల ప్రయాణం
- వారితో పాటు విశ్రాంత ఇంజినీర్లు
- ప్రాజెక్టుతో ఒడిశాకు నష్టంపై అంచనా



పోలవరం ప్రాజెక్ట్ పరిశీలిస్తున్న బీజేడీ నాయకులు



ప్రాజెక్టు నమునాని పరిశీలిస్తున్న దృశ్యం



పర్యటించిన బృందంతో పరిస్థితిని సమీక్షిస్తున్న మాజీ మంత్రి దేవి మిశ్ర

కొరాపుట్: ఆంధ్రప్రదేశ్–ఒడిశా రాష్ట్రాల మధ్య వివాదంగా మారిన పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతాన్ని ఒడిశాలోని విపక్ష బిజూ జనతా దళ్ పార్టీ ముఖ్య నాయకులు రహస్యంగా పరిశీలించారు. మంగళవారం ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్ట్ నిర్మాణ పరిసర ప్రాంతాల్లో రహస్య పర్యటన సాగించారు. ఈ విషయాలు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలతో పాటు, కేంద్ర ప్రభుత్వానికి సైతం తెలియకుండా జాగ్రత్త పడ్డారు. సోమవారం రాత్రి రైలులో భువనేశ్వర్ నుంచి బయల్దేరి మంగళవారం ఆంధ్రా చేరుకొని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పర్యటించారు. మరలా తిరుగు ప్రయాణం కూడా అదేవిధంగా జరిగింది. ఒకానొక సమయంలో తిరుగు ప్రయాణంలో విశాఖపట్నంలో జాతీయ మీడియా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేయాలనుకొని రద్దు చేశారు. అయితే ఈ పర్యటనపై స్థానిక మీడియా ప్రతినిధులు బుధవారం ప్రశ్నించగా స్పందించడానికి నిరాకరించారు. క్షేత్రస్థాయిలో తమ అనుమానాల నివృత్తి కోసం ఒడిశా నుంచి నీటి పారుదల శాఖలో విశ్రాంత సీనియర్ ఇంజినీర్లను సైతం తమతో తీసుకెళ్లడం గమనార్హం. ఈ పర్యటనలో మాజీ మంత్రులు దేవి మిశ్ర, అతున్ సవ్యసాచి, రాజ్యసభ ఎంపీ మున్నాఖాన్, మాజీ ఎంపీలు నెక్కంటి భాస్కర రావు, ప్రదీప్ మఝి, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి బృగుభక్షి పాత్రోలు ఉన్నారు.

ఒడిశా అభ్యంతరాలు

ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు పెంచడం వలన ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలో అనేక గ్రామాలు ముంపు బారిన పడతాయి. కానీ ఆయా గ్రామాల ప్రజలకు పరిహారం విషయం తేలలేదు. ఇంతలో కేంద్ర ప్రభుత్వం పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించింది. ముంపు గ్రామాల ప్రజల సమస్య తేలకుండా నిధులు ఇవ్వడంపై బీజేడీ మండిపడుతోంది. పోలవరం నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే ముందు నిర్వాసితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ కేంద్రం ఈ వాదన పట్టించుకోవడం లేదు. దీంతో మరోసారి పూర్తిస్థాయిలో నివేదికలు సిద్ధం చేసుకోవడానికి విశ్రాంత ఇంజినీర్లతో బీజేడీ బృందం పర్యటించినట్లు తెలుస్తోంది.

జగదీష్ నాయక్‌కు నివాళి



జగదీష్ చంద్ర నాయిక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక జగదీష్ చంద్ర నాయిక్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మున్సిపల్ మాజీ చైర్మన్, న్యాయవాది జగదీష్ నాయిక్ జయంతి వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. పాఠశాల హెచ్‌ఎం ఉపేంద్రకుమార్ దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్‌గా ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం మెట్రిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో నాయిక్ పెద్ద కుమారుడు, న్యాయవాది నటేంద్ర కుమార్ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

265 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

- వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది అరెస్టు

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మోతుగూడెం, చింతూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో బుధవారం వేర్వేరు ఘటనల్లో రూ.13.25 లక్షల విలువైన 265 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వీటికి సంబంధించిన వివరాలను స్థానిక ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా బుధవారం వెల్లడించారు. ఒడిశా నుంచి తెలంగాణకు 20 కిలోల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న గోదావరిఖనికి చెందిన నిమ్మల మణికంఠను మోతుగూడెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మరో ఘటనలో అదే చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒడిశా నుంచి తెలంగాణకు కారులో తరలిస్తున్న 215 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని భువనగిరికి చెందిన ధీరావత్ గణేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి రవాణా చేసేందుకు చింతూరు బస్టాండ్ వద్ద సిద్ధంగా ఉంచిన 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని చింతూరు మండలానికి చెందిన ఐదుగురు, తెలంగాణకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చింతూరు సబ్ డివిజన్ పరిధిలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐలు శ్రీనివాసరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో చోరీ చేసిన వ్యక్తి అరెస్టు



పట్టుబడిన నిందితుడు గణేష్



స్వాధీనం చేసుకున్న ఆటో



స్వాధీనం చేసుకున్న చెవి దుద్దులు

కొరాపుట్: వేర్వేరు చోట్ల ఆటో, చెవి దుద్దులు దొంగతనం చేసిన వ్యక్తిని నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు వివరాలను బుధవారం తెలియజేశారు. జిల్లా కేంద్రం సమీపంలోని కేసరిగుడ వద్ద సనపిలా జానీ గోదాములో ఇటీవల ఆటో మాయమైంది. అలాగే అదే గ్రామంలో సత్య సుందర్ బోత్ర నివాసంలో దొంగతనం జరిగి, రెండు బంగారు చెవి దుద్దులు పోయాయి. ఈ మేరకు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అదే గ్రామానికి చెందిన మెటా జానీ (గణేష్) వద్ద దొంగతనం జరిగిన వస్తువులు స్వాధీనమయ్యాయి. దీంతో పోలీసులు గణేష్‌ని అరెస్ట్ చేసి జైలుకి తరలించారు. ఈ కేసుని పట్టణ పోలీస్‌స్టేషన్ ఐఐసీ సంబిత్ కుమార్, ఎస్‌ఐ సబీర్ అహ్మద్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

రాయగడ: విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు ఎటువంటి అనుమతులు లేకుండా పాఠశాలకు గైర్హాజరవ్వడంతో జొడొఅంబ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్ చంద్ర నాయక్ సస్పెన్షన్‌కు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 22వ తేదీన జిల్లా విద్యాశాఖ అధికారి బసంత కుమార్ నాయక్ కాసీపూర్ సమితిలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. ఈ నేపథ్యంలో సమితి పరిధిలోని జుడా అంబొ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. అయితే ఆరోజు పాఠశాల హెచ్‌ఎం ఎటువంటి అనుమతి లేకుండా విధులకు హాజరవ్వకపోవడంపై మండిపడ్డారు. దీంతో ఈనెల 23వ తేదీన విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా విధులకు సక్రమంగా హాజరు కాకుండా ఉన్న ప్యూన్ విశ్వజీత్ మహంతకు సంబంధించి ఒక్కరోజు జీతాన్ని నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా టిటిరెఝుల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రభీర్ కుమార్ చౌదరి, కాసీపూర్ సమితి శంకరడ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఖాంబేశ్వర్ గౌరడ, బిజయలక్ష్మీ పొరిడలు సైతం విధులకు సక్రమంగా హాజరవ్వడం లేదన్న ఆరోపణలపై ఒక్కరోజు జీతాలు నిలిపి వేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక కొత్త బస్టాండ్ రోడ్డు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం వద్ద అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. బరాటం నాగేశ్వరరావు సహకారంతో అభయాంజనేయస్వామికి లక్ష తమలపాకుల అర్చన, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు వేద పండితులు వనమాలి మణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నప్రసాద కార్యక్రమంలో పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు లెంక మధు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ మ్యాచ్ విజేతగా పురపాలక సంఘం టీమ్



పరిచయం చేసుకుంటున్న ఇరు టీమ్‌ల సభ్యులు

పర్లాకిమిడి: జాతీయ క్రీడా దినోత్సవం, పురపాలక స్వపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కృష్ణచంద్ర గజపతి కళాశాల మైదానంలో బుధవారం ఉదయం ప్రెస్‌క్లబ్ వర్సస్ పురపాలక లెవన్ టీమ్‌లు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఈ మ్యాచ్‌కు పురపాలక సంఘం చైర్మన్ నిర్మలా శెఠి ముఖ్య అతిథిగా విచ్చేశారు. పురపాలక సంఘం టీమ్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నారు. వీరు నిర్ణీత 15 ఓవర్లకు ఐదు వికెట్ల నష్టానికి 145 పరుగులు చేశారు. దీనికి ధీటుగా ప్రెస్‌క్లబ్ టీమ్ బరిలోకి దిగి నిర్ణీత 15 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 117 పరుగులు మాత్రమే చేసింది. దీంతో పురపాలక టీమ్ విజేతగా నిలిచింది.

ప్రిన్సిపాల్‌పై చర్యలేవీ..?



ఆందోళన చేపడుతున్న విద్యార్థులు

- బిసంకటక్‌లో డైట్ విద్యార్థుల ఆందోళన

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో డైట్ కళాశాల విద్యార్థులు నోటికి నల్లగుడ్డలు కట్టుకొని ఇన్‌స్టిట్యూట్ ముందు శాంతియుతంగా బుధవారం ఆందోళన చేపట్టారు. కొద్ది నెలలుగా ఇన్‌స్టిట్యూట్‌లో ప్రిన్సిపాల్ శరత్ కుమార్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, విద్యార్థినుల మరుగుదొడ్ల ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ల్యాప్‌టాప్‌లో చూస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై ఈనెల 2వ తేదీన విద్యార్థులంతా కలిసి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అప్పటి కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కర్‌ను ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశించారు. దీంతో సబ్ కలెక్టర్‌తో పాటు ఐదుగురి బృందం బిసంకటక్‌లోని డైట్ ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లి విచారణ చేపట్టింది. అయితే అందుకు సంబంధించి ఇంతవరకు నివేదికను సమర్పించలేదని, అదేవిధంగా ప్రిన్సిపాల్‌పై ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని విద్యార్థులు ఆరోపిస్తూ మరలా ఆందోళన చేపట్టారు. తక్షణమే ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

పేపర్ మిల్లు కార్మికుల ఆందోళన



మంత్రి సంపత్ చరణ్ స్వయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



విధాన సభ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

కొరాపుట్: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని విధాన సభ ప్రాంతంలో జయపురం సేవా పేపర్ మిల్లు కార్మికులు బుధవారం ఆందోళన తెలిపారు. సేవా పేపర్ మిల్లుని వెంటనే ప్రారంభించాలని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నేత, మాజీ ఎమ్మెల్యే నారాయణ రెడ్డి, కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బిజయ జెన్నా నేతృత్వంలో ప్రతినిధుల బృందం రాష్ట్ర పరిశ్రమల మంత్రి సంపత్ చరణ్ స్వయ్‌ని కలిసి వినతిపత్రం అందజేసింది. గతేడాది జులై నుంచి పరిశ్రమ మూతపడిందని, ఆరు నెలలుగా కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ పొందిన కార్మికులకు బకాయిలు చెల్లించలేదని పేర్కొన్నారు. అనంతరం కార్మికులు తమ వినతిపత్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం, ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్‌కు, జిల్లాకి చెందిన సీఎల్పీ నాయకుడు, ఎంఎల్ఏ రాం ఖడంలకు అందజేశారు. కార్యక్రమాల్లో కార్మిక నాయకులు ప్రమోద్ కుమార్ మహంతి, నర్సింగ మహాపాత్రో, బసంత్ బెహరలు పాల్గొన్నారు.

స్వాభిమాన్ ఏరియాలో ఐజీ పర్యటన



సీఎం మోహన్ చరణ్ మాఝీతో ఐజీ అగర్వాల్



స్వాభిమాన్ ఏరియాలో పర్యటిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలోని గుర్రసేత్ బీఎస్ఎఫ్ క్యాంప్‌ను బీఎస్ఎఫ్ ఐజీ చార్‌దాబార్ అగర్వాల్ బుధవారం సందర్శించారు. వివరాల్లోకి వెళ్తే.. చార్‌దాబార్ అగర్వాల్ ఇటీవల ఐజీగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయన మొదట భువనేశ్వర్ వెళ్లి సీఎం మోహన్ మాఝిని కలిశారు. అనంతరం మల్కన్‌గిరిలోని స్వాభిమాన్ ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒడిశాలో మొత్తం 20 బెటాలియన్ల బీఎస్ఎఫ్ జవాన్లు ఉన్నారని తెలిపారు. మల్కన్‌గిరి జిల్లాలో నాలుగు బెటాలియన్లు ఉండేవని, అయితే ప్రస్తుతం మావోల అలజడి తగ్గడంతో ఒక బెటాలియన్‌ను వెనక్కి పంపినట్లు పేర్కొన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఆయనతో పాటు బీఎస్ఎఫ్ డీఐజీ సత్యవాన్ ఖంచి, డీఐజీ స్పెషల్ ఆపరేషన్ సంజాయ్ జాకబ్, మల్కన్‌గిరి హెడ్ క్వార్టర్స్ కమాండెంట్ మహేష్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కిడ్నీవ్యాధుల కలకలం



సంబరలెండి గ్రామం

- నంబరలెండిలో రెండు నెలల్లో 10 మంది మృతి



తమను ఆదుకోవాలని కోరుతున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని సంబరలెండి గ్రామం కిడ్నీ వ్యాధులతో సతమతమవుతోంది. గుడారి సమితి కర్లాఘాటి పంచాయతీలోని ఈ గ్రామం అత్యంత మారుమూల ప్రాంతంలో ఉంది. సుమారు మూడు వందలకు పైగా జనాభా నివసిస్తున్న ఈ గ్రామంలో కిడ్నీ వ్యాధులు భయాందోళనకు గురి చేస్తున్నాయి. గత రెండు నెలల్లో ఈ వ్యాధి బారినపడి ఇప్పటివరకు 10 మంది వరకు మృతి చెందారు. ప్రస్తుతం వ్యాధితో గ్రామానికి చెందిన రమేష్ సాబొరొ, పానే సాబొరొ, రామ గొమంగొ, ఎడిసా టుకురుణ, బరు మహానందియా, దమే బిడిక, జుగల్ బెనియా, శంబార టుకురంగలు బాధపడుతున్నారు. కిడ్నీ వ్యాధుల నుంచి తమను కాపాడండి మహాప్రభో అని సంబంధిత శాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ వైద్యశాఖ అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. తాగునీటి సమస్య కారణంగా ఈ వ్యాధులు వ్యాపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నప్పటికీ, గ్రామానికి వచ్చి పరీక్షలు నిర్వహించడం లేదని చెబుతున్నారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీల్లో మెరిసిన విద్యార్థులు



సాధించిన పతకాలతో విద్యార్థులు

భోగాపురం: ఈనెల 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో భోగాపురం మండలంలోని తూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సీహెచ్ సాత్విక్, డి.దుర్గాదేవి, కె.ఇందు విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈ మేరకు బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, తోటి విద్యార్థులు, పీడీ సత్యనారాయణ, సిబ్బంది అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తికి గాయాలు



కురుపాం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు శివ గోవింద

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం శివన్నపేటలోని నాగమ్మకోవెల సమీపంలో బుధవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో కురుపాం మండల కేంద్రానికి చెందిన కొత్తకోట శివ గోవిందకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం గమనించిన స్థానికులు క్షతగాత్రుడ్ని సమీపంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సంఘటనపై కురుపాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 5 లక్షల విలువైన మద్యం ధ్వంసం



ధ్వంసానికి సిద్ధం చేసిన మద్యం బాటిల్స్‌తో పోలీసులు

రాజాం సిటీ: వివిధ కేసుల్లో పట్టుబడిన రూ.5 లక్షల విలువైన మద్యం బాటిల్స్‌ను రాజాం రూరల్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో బుధవారం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బీవీజీ రాజు సమక్షంలో ధ్వంసం చేశారు. రాజాం రూరల్ పరిధిలోని రేగిడి, వంగర, సంతకవిటి స్టేషన్ల పరిధిలో 2,334 మద్యం బాటిల్స్, 30 లీటర్ల సారా, రేగిడి స్టేషన్ పరిధిలో 900, వంగర పరిధిలో 700, అలాగే సంతకవిటి పరిధిలో స్వాధీనం చేసుకున్న 734 మద్యం బాటిల్స్ ధ్వంసం చేశామని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై షేక్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

10.5 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి నిందితులను పట్టుకున్న జీఆర్‌పీ సిబ్బంది, స్వాధీనం చేసుకున్న గంజాయి, ముసుగులో నిందితులు

విజయనగరం క్రైమ్: విశాఖ జీఆర్‌పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు నేతృత్వంలో విజయనగరం జీఆర్‌పీ ఎస్సై బాలాజీరావు బుధవారం విజయనగరం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్‌కి చెందిన సురందర్ కుమార్, ఆంటోనీ గాడ్సన్‌లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 10.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చారు.

నేడు జాతీయ క్రీడా దినోత్సవం

విజయనగరం: హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 29న జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అయోధ్యా మైదానంలో హాకీ పోటీలు, రాజీవ్ స్టేడియంలో కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకు విజ్జి స్టేడియంలో 2 కిలోమీటర్ల పరుగు పోటీ నిర్వహిస్తామని చెప్పారు. సాయంత్రం క్రీడా పోటీల్లో విజేతలకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వివిధ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను సత్కరిస్తామని చెప్పారు.

ఏరు దాటినంతవరకు ఓడ మల్లన్న..ఏరు దాటాక బోడి మల్లన్న అన్న చందాన వ్యవహరిస్తోంది కూటమి ప్రభుత్వం. 2024 సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లకు 'సూపర్ సిక్స్' హామీలు అంటూ మేనిఫెస్టో రూపొందించి అరచేతిలో వైకుంఠం చూపించారు. అందులో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతల కోసం అమలు చేసిన రైతు భరోసా పథకం పేరు మార్చి తాము అధికారంలోకి వస్తే 'అన్నదాత సుఖీభవ' కింద ఏడాదికి రూ.20,000 రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. ఇలా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతలు మళ్లీ పూర్వపు రోజులే వచ్చాయని గుర్తుకు తెచ్చుకుంటూ పెట్టుబడి సాయం కోసం వడ్డీ వ్యాపారుల దగ్గరకు పరుగులు పెడుతున్నారు.



విజయనగరం మండలం పినవేమలి గ్రామంలో వరి పంటకు ఎరువు వేస్తున్న రైతు

తప్పని అప్పుల తిప్పలు..!

- పెట్టుబడి కోసం అన్నదాతల ఆరాటం
- వడ్డీ వ్యాపారుల చుట్టూ ప్రదక్షిణలు
- ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా అన్నదాత సుఖీభవ ఊసెత్తని కూటమి ప్రభుత్వం

విజయనగరం ఫోర్ట్: అధికారంలోకి వస్తే రైతులకు ప్రతి ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్‌డీఏ కూటమి నేతలు ఎన్నికల ప్రచార సభలు జరిగిన ప్రతి గ్రామంలో ఊదరగొట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే ఎక్కువగా ఇస్తాం. కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ పెద్దఎత్తున ప్రచారం చేశారు. తీరా గెలిచిన తర్వాత రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవ పథకంగా కూటమి ప్రభుత్వం పేరు మార్చింది. కానీ రైతులకు మాత్రం ఇస్తానన్న రూ.20 వేల సాయం గురించి నోరు మెదపడం లేదు. దీంతో రైతులు అగమ్యగోచర స్థితిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన మాటలకు చేసే చేతలకు పొంతన ఉండడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడికోసం అవస్థలు

ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి, మొక్కజొన్న, వేరుశనగ, పత్తి, గోగు వంటి పంటలు సాగు చేస్తున్నారు. అయితే పంటల సాగుకు పెట్టుబడికి డబ్బులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం నుంచి సాయం అందక పోవడంతో ప్రైవేట్‌గా అప్పులిచ్చే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది.

మళ్లీ పాతరోజులు..

సాగు పెట్టుబడికి రైతులు 2019కి ముందు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేసి పెట్టుబడి పెట్టేవారు. మళ్లీ పాత రోజులే వచ్చాయని గుర్తు చేసుకుంటున్నారు. గతంలో పంట పెట్టుబడికి వ్యాపారుల దగ్గర వడ్డీకి అప్పుగా తెచ్చుకుని పంట పండాక విక్రయించిన తర్వాత వడ్డీ, అసలు చెల్లించేవారు.

గతంలో సాగుకు ముందే సాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పంటల సాగు ప్రారంభం కాకముందే వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించేంది. ఏటా రూ.13,500 చొప్పున మే నెలలోనే మొదట విడత సాయాన్ని రైతులకు అందించేది. దీంతో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునేవారు. గడిచిన ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ విధంగానే రైతులకు సాయం అందించింది. దీంతో రైతులు వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి తప్పింది.

గడిచిన ఐదేళ్లలో రూ.1576 కోట్లు అందజేత

వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద 2019 నుంచి 2023 వరకు కోట్లాది రుపాయలను రైతు భరోసా పథకం కింద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అందజేసింది. ఈ మేరకు పెట్టుబడి సాయం కింద రూ.1576 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది.

వ్యాపారి దగ్గర రూ.15 వేలు అప్పు చేశాను



నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. అందులో వరి పంట సాగు చేశాను. పంట పెట్టుబడికి వ్యాపారి దగ్గర రూ.15 వేలు అప్పు తీసుకున్నాను. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం హయాంలో ప్రతి ఏటా పంట వేసే ముందు రైతు భరోసా డబ్బులు పడేవి. దీంతో అప్పు చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదు. కానీ ఇప్పుడు రైతు భరోసా రాకపోవడం వల్ల అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

పల్ల సింహాచలం, రైతు, మెంటాడ మండలం

రైతు భరోసా డబ్బులు రాక ఇబ్బందులు



నాకు రెండెకరాల పొలం ఉంది. అందులో వరి పంట సాగుచేశాను. పెట్టుబడికి డబ్బులేక వడ్డీ వ్యాపారి దగ్గర అప్పు చేసి పెట్టుబడి పెట్టాను. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మే నెలలోనే డబ్బులు మా బ్యాంకు ఖాతాలో పడేవి. వాటితో పంటసాగుకు పెట్టుబడి పెట్టేవాణ్ని. ఈ ఏడాది రైతు భరోసా పడక పోవడం వల్ల అప్పు చేసి పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది.

నెట్టి ముకుంద, రైతు బిక్కలవలస, బొండపల్లి మండలం

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు

అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఎటువంటి గైడ్‌లైన్స్ ప్రభుత్వం నుంచి ఇంకా రాలేదు. రాగానే నిధులు జమ చేస్తాం.

వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

హామీ లేకుండానే ముద్ర రుణాలు

- కలెక్టర్ అంబేడ్కర్
- బ్యాంకర్లతో సమావేశం



ఆర్‌బీఐ నిర్వహిస్తున్న క్విజ్‌పోటీల పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: బ్యాంకులకు ఎటువంటి హామీ చూపించకుండానే ముద్ర రుణాలను పొందవచ్చనని ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం కింద శిశు విభాగంలో రూ.50వేల వరకు, కిశోరీ విభాగంలో రూ.5 లక్షల వరకు, తరుణ్ విభాగం కింద రూ.10 లక్షల వరకు ముద్ర రుణాలను పొందే అవవకాశం ఉందని చెప్పారు. జిల్లా స్థాయి డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమావేశం కలెక్టరేట్‌లో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో వివిధ స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు గత త్రైమాసికంలో సాధించిన ప్రగతిపై బ్యాంకులు ప్రభుత్వ శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం ఆర్‌బీఐ నిర్వహిస్తున్న క్విజ్ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. చిరు వ్యాపారులకు చిన్న చిన్న యూనిట్లను స్థాపించే వారికి ముద్ర రుణాలు ఎంతో ప్రయోజనకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎటువంటి హామీ చూపించకుండానే ఈ రుణాలను బ్యాంకుల నుంచి సులువుగా పొందవచ్చని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, ఎల్‌డీఎం వీవీ రమణమూర్తి, నాబార్డ్ డీడీఎం నాగార్జున, ఎల్‌డీఓ సునీల్, మెప్మా డీడీ సుధాకరరావు, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, నైపుణ్య అధికారి గోవిందరావు, డీసీసీబీ సీఈఓ ఉమామహేశ్వర్రావు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జీవనోపాధి కార్యక్రమాలు చేపట్టాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


పార్వతీపురం: జిల్లాలో జీవనోపాధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవనోపాధి కార్యక్రమాలను సంబంధిత విభాగాలన్నీ సమన్వయంతో చేపట్టాలని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ సమన్వయం చేయాలని స్పష్టం చేశారు. ట్రైకార్ ద్వారా నిర్వహించే కార్యక్రమాలను సమన్వయంతో పనిచేస్తూ సంబంధిత పథకాలు అర్హులైన గిరిజనులకు అందేందుకు కృషిచేయాలని కోరారు. వచ్చే సంవత్సరంలో జాబ్‌మేళాలు నిర్వహించి 5వేలమందికి నైపుణ్య శిక్షణ, ఉద్యోగ కల్పన జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఎస్ఎస్.శోభిక, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ ప్రవేశాలు ప్రారంభం

విజయనగరం ఫోర్ట్: విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ అడ్మిషన్లు బుధవారం ప్రారంభమయ్యాయి. అల్‌ఇండియా కోటాలో 22 సీట్లను వైద్య కళాశాలకు కేటాయించారు. దీనికి సంబంధించిన ప్రవేశాలు ముందుగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు నలుగురు ప్రవేశాలు పొందారు. గత ప్రభుత్వం వైద్య కళాశాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటుచేసి గతేడాది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, ఆర్ఎంఓ డాక్టర్ ఎస్.సురేష్‌బాబు అడ్మిషన్ పక్రియ నిర్వహించారు.

అక్షర సైనికుడు 'గిడుగు'

- నేడు గిడుగు జయంతి
- తెలుగు భాషా దినోత్సవం



విజయనగరం టౌన్: వ్యవహారిక భాషోద్యమ స్థాపకునిగా గిడుగు రామమూర్తి పేరు ప్రఖ్యాతులు పొందారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోనికి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలును తెలియజెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యవహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారునిగా గుర్తింపు పొందారు. 1863 ఆగస్టు 29న శ్రీకాకుళం జిల్లాలోని శ్రీముఖలింగ క్షేత్రం దగ్గర ఉన్న పర్వతాలపేటలో జన్మించారు. తండ్రి వీర్రాజు, తల్లి వెంకటమ్మ. ప్రాథమిక విద్య పర్వతాలపేటలోనే కొనసాగింది. తండ్రి చనిపోవడంతో విజయనగరంలో ఉన్న మేనమామ ఇంట్లో ఉంటూనే మహారాజా పాఠశాలలో 1875 నుంచి 1880 వరకూ విద్యనభ్యసించారు. గురజాడ అప్పారావుకు సహాధ్యాయి. అడవుల్లో నివసించే సవరులకు అర్థమయ్యేలా వారి భాషలోనే పుస్తకాలు రాసి చదువుచెప్పిన ఘనత గిడుగుదే. ఏటా ఆయన జయంతి నాడు తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా పలువురు భాషావేత్తలు మాట్లాడుతూ తెలుగుభాషను పరిరక్షించాల్సిన అవసరం ఉందని నొక్కివక్కానించారు.

తెలుగు భాష జాతికి జీవనాడి



ఆంధ్రా అక్షరం.. అమృత గుళిక. అనంతమైన దివ్య సంస్కృతి మన మాతృ భాష. జాతికి జీవనాడి మన తెలుగు భాష. మన మాతృభాష తెలుగు భాష నశిస్తే జాతి నశించిపోతుంది. తెలుగు జాతికి పూర్వ వైభవం రావాలి. తెలుగు భాష ఓ అద్భుతం. ప్రపంచ దేశాలను మంత్రముగ్ధులను చేసే శక్తి, భావోద్వేగ పూరితమైన భాష మనది. తెలుగును నిలబెట్టుకోవడమంటే మన జాతి ఘన వారసత్వ సంస్కృతీ, మూలధనాన్ని పరిరక్షించుకోవడమే. తెలుగు వెలుగులు విరజిమ్మాలి. మనమంతా ఆ దిశగా కృషిచేయాలి.

– కోరుపోలు కళావతి, రచయిత్రి, విజయనగరం

తెలుగు బోధనా భాషగా ఉండాలి



తెలుగు భాష వ్యవహారంలో దూరమైపోతుంది. కనీసం పదోతరగతి వరకు బోధన భాషగా ఉంచాలి. తెలుగు నేర్చుకుంటే అన్ని భాషలు వస్తాయి. మాతృభాషలో ప్రవేశం తప్పనిసరిగా ఉండాలి. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం వారి మాతృభాషను బోధన భాషగా చేయాలి. యునెస్కో సంస్థ తెలిపిన ప్రకారం ఏ భాష అయితే 30 శాతం వ్యవహారంలో కన్నా తక్కువకు పడిపోతుందో ఆ భాష అంతరించిపోయినట్టు లెక్క. అందులో తెలుగు భాష కూడా ఉంది. ప్రభుత్వం స్పందించి మాతృభాష పరిరక్షణకు కృషిచేయాలి.

– డాక్టర్ ఎ.గోపాలరావు, అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు

పరీక్షల పేరు మార్పు..!

- నాడు ఫార్మేటివ్ అసెస్‌మెంట్..
- నేడు సెల్ఫ్ అసెస్‌మెంట్‌గా మార్పు



సెల్ఫ్ అసెస్‌మెంట్‌గా పరీక్షలు రాస్తున్న ఉల్లిభద్ర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

పాలకొండ రూరల్: విద్యారంగంలో సమూలమార్పులు తీసుకువచ్చిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉనికి కనబడకుండా చేయాలనే తాపత్రయం తప్పితే కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న మార్పులు విద్యావ్యవస్థలో ఏమీ కనరావడం లేదు. ప్రభుత్వ పాఠశాలలో బోధన పొందుతున్న ఒకటి నుంచి పదవ తరగతుల మధ్య విద్యార్థుల వ్యక్తిగత ప్రమాణాలు అంచనావేసి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టేలా గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం టోఫెల్ పేరిట తరగతులు కొనసాగించింది. నాడు విద్యార్థుల భవిష్యత్తు రీత్యా నిర్వహించిన పరీక్షలకు సెల్ఫ్ అసెస్‌మెంట్‌గా టెస్టుగా కూటమి ప్రభుత్వం నేడు పేరు మార్పుచేసింది.ఈ క్రమంలో బుధవారం నుంచి ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు బోధన సాగిస్తున్న విద్యార్థులకు సంబంధించి పాఠశాల స్థాయి నుంచి అభ్యసనా సామర్థ్యం అంచనా వేసేందుకు నిర్వహించే యూనిట్ పరీక్షలకు తాజాగా పేరు మార్పు చేశారు. ఇదివరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ)గా ఉన్న యూనిట్ పరీక్షలకు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్(ఎస్ఏఎం)గా మార్పు చేస్తూ యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఏడాదిలో మూడుసార్లు ఈ పరీక్షలను రోజుకు రెండు సబ్జెక్టులు చొప్పున నిర్వహించేవారు. తాజాగా సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు రోజుకు ఒక సబ్జెక్టు వంతున ఆరురోజులు కొనసాగనున్నాయి. షెడ్యూల్ ప్రాప్తికి ఈ పరీక్షలు సెప్టెంబర్ 4 వరకు నిర్వహించేలా విద్యాశాఖ నిర్ణయించింది. ప్రాథమిక తరగతులకు సంబంధించి ఈ పరీక్షలు ఉదయం 10:45గంటల నుంచి 11:45 వరకు, ఉన్నత తరగతులకు సంబంధించి మధ్యాహ్నం 1:30గంటల నుంచి 2:30 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తునట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సాగించే విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా గతంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోఫెల్ తరగతులను కూటమి ప్రభుత్వం ఈ అకడమిక్ విద్యా క్యాలెండర్‌లో ప్రస్తావనకు తీసుకురాలేదు. ఈ క్రమంలో ఈ ఏడాది నుంచి టోఫెల్ తరగతులు ఇక ప్రభుత్వ బడుల్లో లేనట్లే భావించాల్సి ఉంటుందని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పేర్కొంటున్నారు.

ప్రణాళికాబద్ధంగా పరీక్షలు

పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేపట్టాం. మండలాల వారీగా పరీక్షాపత్రాలు సమకూర్చాం. మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించేలా సూచనలు చేశాం. విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపర్చేందుకు ఈ పరీక్షలు ఎంతగానో తోడ్పడతాయి. పటిష్టంగా పరీక్షల నిర్వహణ జరుగుతుంది.

– జి.పగడాలమ్మ, డీఈఓ, పార్వతీపురం మన్యం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామానికి చెందిన మజ్జి శ్రీరామ్ (32)పురుగు మందు తాగడంతో అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు. ఈ మేరకు ఎస్సై యు.మహేష్ మాట్లాడుతూ శ్రీరామ్ నిత్యం మద్యం తాగుతూ డబ్బుల కోసం కుటుంబ సభ్యులతో గొడవ పడడమే కాకుండా అప్పుల పాలైనట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన శ్రీరామ్ బుధవారం ఉదయం ఇంటి డాబాపైకి వెళ్లి పురుగు మందు తాగేశాడని, ఈ విషయం గమనించిన తల్లి శ్రీదేవి వెంటనే విజయనగరంలోని ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించామన్నారు.

శతాధిక వృద్ధురాలు..



శతాధిక వృద్ధురాలు బంగారమ్మ (ఫైల్)

బొండపల్లి: మండలంలోని కొవ్వాడ పేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కొవ్వాడ బంగారమ్మ (105) బుధవారం ఉదయం గ్రామంలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచింది. ఆమె భర్త చాలా ఏళ్ల క్రితమే మృతి చెందడం, తనకు సంతానం ఎవరూ లేకపోవడంతో ఒంటరిగానే జీవనం సాగించింది. గ్రామంలోని రామాలయంలో నిత్యం దేవుని సేవలో నిమగ్నమై స్వామివారికి సేవ చేస్తూ ప్రతి ఒక్కరూ దేవుని సేవ చేయాలని, అందరూ మంచి మార్గంలో పదేపదే సూచించేదని గ్రామస్తులు తెలిపారు. ఆమె అంత్యక్రియలను గ్రామస్తులంతా కలిసి నిర్వహించారు.

చికిత్స పొందుతూ మరో వ్యక్తి..

భోగాపురం: ట్రాక్టర్ బోల్తాపడి తీవ్రంగా గాయపడిన డెంకాడ మండలంలోని జొన్నాడ పంచాయతీ మన్యాలపేట గ్రామానికి చెందిన గొలగాన అప్పలరాజు(54) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. మన్యాలపేట గ్రామానికి చెందిన గొలగాన అప్పలరాజు అదే గ్రామానికి చెందిన ఇటుకల వ్యాపారం చేస్తున్న చెల్లూరి సంతోష్ దగ్గర ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ట్రాక్టర్ ఓనర్ ఆదేశాల మేరకు ఈనెల 21వ తేదీ ఉదయం ట్రాక్టర్‌లో ఇటుకల లోడు చేసుకుని భోగాపురం మండలంలోని అమటాం రావివలస గ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో రావివలస జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను చూసి సడన్‌గా బ్రేక్ వేయగా ఒక్కసారిగా ట్రాక్టర్ బోల్తాపడగా డ్రైవర్ అప్పలరాజు తీవ్ర గాయాలపాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ ఓనర్ చెల్లూరి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తవుడు తెలిపారు.

ఇన్నాళ్లకు ఆత్మశాంతి

సర్వకాల సర్వావస్థల యందు నీవెంటే నేనుంటానంటూ పెళ్లినాడు ప్రమాణం చేసి.. భర్తతో ఏడడుగులు నడిచిన భార్యే.. భర్తను హత్య చేసిన కేసులో ప్రధాన ముద్దాయిగా తేలింది. ప్రియుడి మోజులో పడి కట్టుకున్న భర్తను పథకం ప్రకారం హత్య చేయించిన కేసులో ప్రధాన ముద్దాయితో పాటు మరో ఐదుగురు ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ కేసు విచారణ అనంతరం న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి.

- హతుడి తల్లిదండ్రుల భావోద్వేగం
- భర్త హత్య చేసిన కేసులో ప్రధాన ముద్దాయి భార్య
- ఇతర ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా



గౌరీశంకరరావు చిత్రపటంతో తల్లిదండ్రులు



భర్త గౌరీశంకరరావును హత్య చేయించిన ప్రధాన ముద్దాయి సరస్వతి (ఫైల్)

గురుగుబిల్లి/పార్వతీపురం టౌన్/వీరఘట్టం: ఉమ్మడి విజయనగరం జిల్లా గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి జలాశయం సమీపంలో.. నాటి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండలంలోని చిట్టపులివలసకు చెందిన నవవరుడు యామక గౌరీశంకర రావు 2018 మే 7న హత్యకు గురైన ఘటన అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. ఈ కేసులో విచారణ అనంతరం ప్రధాన ముద్దాయి అయిన భార్య సరస్వతితో పాటు ప్రియుడు శివ, మరో నలుగురికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.1100 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయస్థానం బుధవారం తీర్పు ఇచ్చింది. ఈ విషయం తెలుసుకున్న హతుడు గౌరీశంకరరావు తల్లిదండ్రులు అప్పలనాయుడు, సింహాచలమ్మలు తమ కుమారుడి ఆత్మకు ఇన్నాళ్లకు శాంతి కలిగిందని భావోద్వేగానికి గురవుతూ స్వగ్రామం చిట్టపులివలసలో కుమారుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఏదిఏమైనప్పటికీ మా ఇంటి పెద్దదిక్కును కోల్పోయామంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

కేసు పూర్వాపరాలు ఇలా..

అప్పటి శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండలంలోని చిట్టపులివలసకు చెందిన యామక అప్పలనాయుడు అదే మండలంలోని కడకెల్లకు చెందిన తన సోదరి గౌరమ్మ కూతురు సరస్వతిని చిన్నప్పటి నుంచి తానే పోషిస్తూ డిగ్రీ వరకు చదివించాడు. అనంతరం తన పెద్ద కుమారుడు గౌరీశంకర రావుకు మేనకోడలు సరస్వతిని ఇచ్చి పెద్దల సమక్షంలో 2018 ఏప్రిల్ 28న పెళ్లి చేశాడు. బీటెక్ చదివిన గౌరీశంకరరావు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరులోని పవర్ ప్లాంట్‌లో పని చేసేవాడు. డిగ్రీ తర్వాత బ్యాంకు టెస్టులు రాసేందుకు 2015లో సరస్వతి విశాఖపట్నంలో కోచింగ్ తీసుకోవడానికి వెళ్లింది. ఆ సమయంలో అక్కడ నర్సీపట్నానికి చెందిన శివ అనే యువకుడితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. తరచూ ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడుతున్న సరస్వతి.. బావతో 2018 ఏప్రిల్ 28న తన పెళ్లి చేశారని, ఆ పెళ్లి ఇష్టం లేదని వాపోతూ భర్తను ఎలాగైనా అడ్డు తొలగించాలని ప్రియుడితో కలిసి పెళ్లయిన నాటి నుంచే పథకం పన్నింది. దీంతో శివ.. తన ప్రియురాలి భర్తను హతమార్చేందుకు విశాఖకు చెందిన రౌడీషీటర్ గోపీతో రూ.10 వేల నగదు, 10 తులాల బంగారం ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ నేపథ్యంలో పథకం ప్రకారం 2018 మే 7న తోటపల్లి జలాశయం సమీపంలోని ఐటీడీఏ పార్కు వద్ద భర్త గౌరీ శంకరరావును ప్రియుడి సాయంతో సరస్వతి హతమార్చి దుండగుల దాడిగా చిత్రీకరించింది. అయితే పోలీసుల దర్యాప్తులో ఈ హత్య ఘటనలో ప్రధాన నిందితురాలు భార్యేనని తేలడంతో ఆమెతో పాటు ప్రియుడు శివ, మరో నలుగురు దుండగులపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపట్టారు. అప్పటినుంచి ఆరేళ్లుగా కోర్టులో నడుస్తున్న ఈ కేసు విచారణ పూర్తి కావడంతో న్యాయమూర్తి బుధవారం తుదితీర్పు చెప్పారు. ఈ కేసులో ఇద్దరు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గొర్లి వెంకటరావు, బడే వెంకట నాయుడు వాదనలు వినిపించారు.

డీజీపీని కలిసిన ఎస్పీ

విజయనగరం క్రైమ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ సిటీకి వచ్చిన డీజీపీను పోలీస్ అతిథిగృహం వద్ద కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్